Velugu Dt 21/03/19







# హైటెక్ మెట్రో షురూ

**హైదరాబాద్, వెలుగు:**

భాగ్యనగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన దిశగా మరో మైలురాయి పడింది. హైదరాబాద్ మెట్రో కారిడార్-3 పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. సిటీలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన హైటెక్ సిటీ రూట్ లో లైన్ క్లియర్ అయింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లోని ఐటీ కంపెనీల్లో సుమారు 7 లక్షల మంది ఐటీ, ఐటీయేతర సంస్థల్లో ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ రూట్ లో ఎప్పుడు చూసినా ట్రాఫిక్ జామ్ లే. రెండు కిలోమీటర్ల దూరానికి అరగంటకు పైగా టైమ్ పడుతుంది. ఇంతటి సంక్లిష్టమైన రూట్ లో ట్రాఫిక్ సమస్యకు మెట్రో చెక్ పెట్టింది. అమీర్ పేట్-హైటెక్ సిటీ రూట్ లో మెట్రో సర్వీసులు ప్రారంభించింది. ప్రస్తుతం మియాపూర్ - అమీర్ పేట్ - ఎల్బీ నగర్, నాగోల్ - అమీర్ పేట్ మార్గాల్లో రోజుకు 1.8 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం హైటెక్ సిటీ మెట్రో 10 కిలో మీటర్లు అందుబాటులోకి రావడంతోనే ఈ సంఖ్య ఏకంగా 3 లక్షలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైటెక్ సిటీ రూట్ లో సర్వీసులు ప్రారంభం కావడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీ రూట్ లో తిప్పలు పడేవాళ్లమని, మెట్రోతో సమస్య పరిష్కారమైందని చెబుతున్నారు. ఉద్యోగుల కోసం రాత్రిపూట ట్రెయిన్ లు పెంచడంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. మంత్లీ పాస్ లు, కామన్ మొబిలిటీ కార్డులు ఇవ్వాలని పేర్కొంటున్నారు. బుధవారం ఉదయం లాంఛనంగా ప్రారంభమైన తర్వాత తొలిరోజు సాయంత్రం 4 గంటలకు ప్రజలను అనుమతించారు.

**ఒక్కో అడుగు ముందుకేస్తూ**

సిటీలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టిన మెట్రో రైల్ ఒక్కో అడుగు వేస్తూ ముందుకు సాగుతోంది. మియాపూర్ - అమీర్ పేట్ - నాగోల్ రూట్ లో 30 కిలోమీటర్లు, అమీర్ పేట్ నుంచి ఎల్బీనగర్ 16 కిలో మీటర్లతో కలిపి ప్రస్తుతం మొత్తం 46 కిలో మీటర్ల పరిధిలో మెట్రో నడుస్తోంది. బుధవారం అందుబాటులోకి వచ్చిన 10 కిలో మీటర్లతో కలిపి 56 కిలో మీటర్లకు చేరింది. ఒక్కో మైలురాయి దాటుతూ మెట్రో వర్గాలు ఉత్సాహంతో ముందుకు పోతున్నాయి. ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టడం సాధ్యం కాదని ఎంతో మంది నిపుణులు కొట్టిపారేసిన ప్రాజెక్టును సుసాధ్యం చేశారు. ప్రభుత్వం నుంచి కేవలం రూ.2300 కోట్లు ఖర్చు పెడితే ఎల్ అండ్ టీ కంపెనీ రూ.1500 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం పూర్తయ్యేనాటికి 20 వేల కోట్లు అయ్యే అవకాశం ఉందని హెచ్ఎంఆర్ వర్గాలు చెబుతున్నాయి. ఇక జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు 10 కిలో మీటర్ల మార్గంపైనా దృష్టి పెట్టారు. ఈ రూట్ లో పనులు చకచకా పూర్తి చేసి డిసెంబర్ నాటికి రాకపోకలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇది అందుబాటులోకి వస్తే మొత్తం 66 కిలోమీటర్ల మెట్రో మార్గం పూర్తయినట్టవుతుంది. ఆ తర్వాత ఎంజీబీఎస్ - ఫలక్‌నుమా మధ్య 6 కిలోమీటర్లపై దృష్టి సారిస్తారు. కానీ రూట్ ఇప్పట్లో పట్టాలెక్కే పరిస్థితి లేదని కొందరు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరు కిలో మీటర్ల రూట్ లో పనులు ప్రారంభించినా, లేకపోయినా రెండో దశపై అధికారులు దృష్టి సారించేందుకు సిద్ధమవుతున్నారు.



**కామన్ మొబిలిటీ కార్డుపై కసరత్తు**

కామన్ మొబిలిటీ కార్డును ప్రవేశపెట్టడంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే సిటీలో 6 లక్షల మంది మెట్రో కార్డును తీసుకోగా, ఇందులో రోజూ వాడేవారు 90 వేల మంది ఉన్నారు. మెట్రో, టీఎస్ఆర్టీసీ, ఎంఎంటీఎస్, ఓలా, ఊబర్ ట్యాక్సీలు, ఆటోలను అనుసంధానం చేయడంపైనా చర్చలు జరుగుతున్నాయి. ఈ 27న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో మరో విడత సమావేశం నిర్వహించనున్నారు. ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ కనెక్టివిటీని అభివృద్ధి చేయడంలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. అలాగే వివిధ మెట్రో స్టేషన్ల నుంచి చుట్టుపక్కల సంస్థలు తమ ఉద్యోగుల కోసం బస్సులు ఏర్పాటు చేసుకోవడంపైనా దృష్టి పెట్టాలని హెచ్ఎంఆర్ సూచించగా ఇప్పటికే కొన్ని సంస్థలు ముందుకొచ్చాయి. ఇటీవల హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి లండన్ పర్యటన సందర్భంగా కూడా కామన్ మొబిలిటీ కార్డుపై చర్చించారు. లండన్ మెట్రోలో కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులోకి రావడానికి 15 ఏళ్లు పట్టిందని, కానీ సిటీలో త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు.

**సర్వీసుల పెంపుపై ఆలోచించాలి**

రద్దీ సమయాలు, రాత్రి వేళల్ని దృష్టిలో పెట్టుకుని సర్వీసులు పెంచడంపై అధికారులు ఆలోచించాలి. సుమారు 7 లక్షల మంది ఐటీ ఎంప్లాయ్ లు పనిచేస్తారు. కచ్చితంగా రోజుకు లక్షన్నర వరకు మెట్రోలో ప్రయాణించే అవకాశముంది. వేసవి సమయంలో హైటెక్ సిటీకి ఏసీ సదుపాయం కలిగిన మెట్రో రావడం వేసవి కానుకగా భావిస్తున్నాను.

- సాయి ప్రభు, ఐటీ ఎంప్లాయ్



